సాక్షి
అన్నమయ్య జిల్లా

సోమవారం । 8 । ఏప్రిల్ । 2024

I



వైఎస్సార్‌సీపీలోకి చేరికలు

వైఎస్సార్‌ సీపీలోకి భారీగా చేరికలు జరుగుతున్నాయి. మదనపల్లె వైఎస్సార్‌ సీపీ కార్యాలయంలో ఆదివారం 200 మంది యువకులు పార్టీలోకి చేరారు. -IIలో

రంజాన్ వేళలు

		ఇఫ్తార్ సోమ (సా॥)	సహర్ మంగళ (ఉ॥)
రాయచోటి	:	6.31	4.49
రాజంపేట	:	6.32	4.48
పీలేరు	:	6.36	4.42
మదనపల్లె	:	6.34	4.51

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)



	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.210	రూ.280
రెండోరకం	రూ.110	రూ.200

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 99 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)



రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	422	470
సీబీ	-	-

మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 270.220 కిలోలు

న్యూస్‌రీల్

నేటితో ముగియనున్న పది మూల్యాంకనం

కడప ఎడ్యుకేషన్: కడప మున్సిపల్ హైస్కూల్ మెయిన్‌లో నిర్వహిస్తున్న పదో తరగతి సమాధాన పత్రాల మూల్యాంకనం సోమవారం ముగియనుంది. ఇందులో భాగంగా ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి వచ్చిన 1,96,635 సమాధాన పత్రాలకు 24,894 పత్రాలకు మూల్యాంకనం జరిగిందని డీఈఓ, క్యాంపు అధికారి మర్రెడ్డి అనురాధ తెలిపారు. మూల్యాంకన కేంద్రంలో సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వసతులను కల్పించామని ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ వెంకటేష్ తెలిపారు.

అవాస్తవాలు ప్రచారం చేసే వారిపై నిఘా



కడప డిఎస్పీషరీఫ్

కడప అర్బన్: సోషల్ మీడియాలో అవాస్తవాలు ప్రచారం చేస్తూ శాంతి భద్రతలకు భంగం కలిగించే వారిపై కఠినచర్యలు తీసుకుంటామని కడప డీఎస్పీ ఎం.డి షరీఫ్ హెచ్చరించారు. ఈ మేరకు ఆదివారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తల మధ్య విద్వేషాలు రగిల్చే విధంగా సోషల్ మీడియా వేదికగా మాట్లాడుతూ, శాంతి భద్రతలకు భంగం కలిగించేలా పోస్టులు పెట్టేవారిపై సైబర్ సోషల్ మీడియా విభాగం నిఘా ఉంటుందన్నారు. సదరు చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడే వారిపై కఠినచర్యలు తీసుకుంటామన్నారు. అవాస్తవ ప్రచారాన్ని ప్రజలు ఎవ్వరూ నమ్మవద్దని డీఎస్పీ సూచించారు. ఫేక్ న్యూస్ వ్యాప్తి లేదా ఫార్వర్డ్ చేసే వారిపై నిఘా ఉంచామన్నారు. నిజానిజాలు తెలుసుకోకుండా సోషల్ మీడియాలో పోస్ట్ చేసే వారిపై, షేర్ చేసే వారిపై, సంబంధిత గ్రూప్ అడ్మిన్‌లపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మంచి అలవాట్లతో ఆరోగ్య సంరక్షణ



మార్ల ఓబుల్ రెడ్డి, జిల్లా సైన్స్ అధికారి

రాయచోటి: మంచి అలవాట్లతోనే తమ ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని జిల్లా సైన్స్ అధికారి మార్ల ఓబుల్ రెడ్డి విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఆదివారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ ఆరోగ్య సంస్థ 2024లో 'నా ఆరోగ్యం నా హక్కు' అనే నినాదం ఇచ్చిందన్నారు. ప్రతి విద్యార్థి మంచి అలవాట్లను ఆచరించాలన్నారు. పండ్లు, ఆకు కూరలు, మంచి పోషక పదార్థాలతో కూడిన ఆహారం రోజువారి ఆహారంలో ఒక భాగం కావాలన్నారు. కూల్ డ్రింక్స్, జంక్ ఫుడ్, ఫాస్ట్ ఫుడ్స్‌కు దూరంగా ఉండాలన్నారు . పొగాకు ఉత్పత్తులకు, మద్యపానానికి అలవాటు పడకుండా జాగ్రత్తపడాలన్నారు. క్రమం తప్పకుండా శారీరక వ్యాయామం చేయాలన్నారు. టీవీ, మొబైల్‌లకు దూరంగా ఉండాలన్నారు. తగినంత నిద్ర, మంచి పుస్తకాలు చదవడం వలన మానసిక ఆరోగ్యం పొందవచ్చని విద్యార్థులకు సూచించారు.చిన్నపాటి సామాజిక సేవా కార్యక్రమాలలో పాల్గొనడం అలవాటు చేసుకోవాలన్నారు. పాఠశాల పనిదినమైన, సెలవైనా నీ గమ్యాన్ని చేరుకోవడానికి క్రమం తప్పక చదవడం అలవాటు చేసుకోవాలన్నారు. గాలి, నీరు, భూమి కలుషితం కాకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటే పర్యావరణాన్ని పరిరక్షించడంతోపాటు మన ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని విద్యార్థులకు ఆయన సూచించారు.

కడపరాయుడి సేవలో ఆర్‌టీఏ కమిషనర్



దేవునికడపలో ఆలయంలో చెన్నారెడ్డి

కడప కోటిరెడ్డిసర్కిల్: దేవునికడపలోని శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామిని ఆదివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. ఆంధ్రప్రదేశ్ ఆర్‌టీఏ కమిషనర్ చెన్నారెడ్డి కుటుంబ సమేతంగా శ్రీవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు అర్చకులు ఆయనకు సాదరంగా స్వాగతం పలికారు. అనంతరం స్వామి వారిని దర్శింపజేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మనోజ్, కడప మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, దేవానందకుమార్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

రామయ్యసేవలో..

ఒంటిమిట్ట: ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి దేవాలయాన్ని ఆదివారం రాష్ట్ర సమాచార కమిషనర్ కాకర్ల చెన్నారెడ్డి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. అర్చకులు వారికి స్వాగతం పలికారు. గర్భాలయంలోని మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు నిర్వహించారు రంగమండపంలో స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు.

చెప్పారంటే.. చేస్తారంటే!



ఈమె పేరు జి.ఈశ్వరమ్మ. మదనపల్లె పట్టణం మోతీనగర్. వృద్ధురాలు కావడంతో ప్రతి నెలా 1వ తేదీనే వలంటీరు ఇంటికి వచ్చి పింఛన్ ఇస్తుండటంతో ఈమె సంతోషం వ్యక్తం చేస్తోంది. టీడీపీ హయాంలో పింఛన్ పొందడానికి కష్టాలు పడ్డామని చెప్పారు.



ఈ చిత్రంలో కనిస్తున్న వృద్ధుడి పేరు ఎస్.గౌస్‌మోహిద్దీన్. మదనపల్లె పట్టణం మోతీనగర్. నిరుపేద కుటుంబానికి చెందినవారు. పింఛన్ నెలనెలా సక్రమంగా వస్తుండంతో సంతోషంగా జీవితం సాగిస్తున్నారు. పింఛన్ పెంచడంతో తన కష్టాలు తీరినేట్లనని చెబుతున్నారు.

- ఐదేళ్లు క్రమంగా పెరిగిన పింఛన్
- ఇంటి వద్దనే ఠంచన్‌గా అందజేత
- అప్పటి కష్టాలు వద్దంటున్న దివ్యాంగులు
- చంద్రబాబు తీరుపై మండిపడుతున్న వృద్ధులు



మదనపల్లె పట్టణం బెంగుళూరు రోడ్డులో ఓ దివ్యాంగుడికి పింఛన్ ఇస్తున్న వలంటీర్ (ఫైల్)

మదనపల్లె సిటీ: ఏ పనీ చేయలేని అవ్వాతాతలు, అభాగ్యులైన అక్కా చెల్లెమ్మలు, ఆదరణ లేని దివ్యాంగులు.. వీరందరూ సమాజంలో గౌరవంగా, ఆత్మస్థైర్యంతో బతికే అవకాశాన్ని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కల్పించింది. కులమతాలకు,రాజకీయాలకు అతీతంగా సామాజిక భద్రత పింఛన్లు అందిస్తోంది. ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించినట్లుగా పింఛన్ మొత్తాన్ని ఏటా పెంచుకుంటూ పోతూ 2024 జనవరి 1 నాటికి రూ.3,000 చేసి పండుటాకుల జీవితాల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వెలుగులు నింపారు. చంద్రబాబు హయాంలో పింఛన్లను ఎలా తగ్గించాలా అనే కోణంలో ఆలోచిస్తే... వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అర్హులు ఏ ఒక్కరూ పింఛన్‌కు దూరం కాకూడదనే లక్ష్యంతో పని చేయడం విశేషం. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటు అయిన వెంటనే పింఛన్ అర్హత వయస్సు 60 ఏళ్లకు తగ్గించారు. దీంతో వేలాది మంది వృద్ధులకు లబ్ధి చేకూరింది.

నాడు 10 రకాలు..
నేడు 16 రకాల పింఛన్లు

టీడీపీ అధినేత చంద్రబాబు హయాంలో 10 రకాల పింఛన్లు మాత్రమే పంపిణీ చేసేవారు. వృద్ధాప్య, వితంతు, వికలాంగ, చేనేత, కల్లుగీత, మత్స్యకార, అభయహస్తం, ఒంటరి మహిళ, కళాకారుల, చర్మకారుల పింఛన్లు ఇచ్చేవారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటు అయిన తర్వాత పింఛన్ల సంఖ్య 16కు చేరడం విశేషం. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కిడ్నీ, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వారికి

సంవత్సరం	లబ్ధిదారులు	పింఛన్ (రూ.కోట్లలో)
2024	226790	76.80
2023	224166	62.00
2022	215224	54.28

రూ.5000 నుంచి రూ.10 వేల వరకు పింఛన్ వస్తోంది. హిజ్రాలు, డప్పు కళాకారులతో పాటు సైనిక్ వెల్ఫేర్ పింఛన్‌లు కూడా పంపిణీ చేస్తూ వేలా మంది జీవితాలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం భరోసా ఇస్తోంది.

చంద్రబాబును నమ్మబోం

దళారులను ఆశ్రయించకుండా, రాజకీయ సిఫారస్సులు లేకుండా అర్హతనే ప్రామాణికంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పింఛన్లు అందిస్తోందని అవ్వాతాతలు, దివ్యాంగులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. టీడీపీ హయంలో జన్మభూమి కమిటీలతో చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నామని, పంచాయతీ కార్యాలయాల చుట్టూ రోజుల తరబడి తిరిగినా పింఛన్ వచ్చేది కాదంటూ గుర్తు చేసుకుంటున్నారు.తెలుగు దేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడు కారణంగా మళ్లీ అవే కష్టాలు మొదలయ్యాయని, పింఛన్ అందుకోవడాని ఎర్రటి ఎండలో పడరాని పాట్లు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చంద్రబాబును నమ్మేది లేదంటూ ఖరాకండిగా చెబుతున్నారు.

నాడు

టీడీపీ హయాంలో ఎంత మంది అర్హులు ఉన్నా మండలానికి ఇన్నే పింఛన్లు అని కోటా పెట్టేవారు. ఒక్కో గ్రామానికి 10–15 వరకు పింఛన్లు వచ్చేవి. జన్మభూమి కమిటీలను ప్రసన్నం చేసుకుంటే లబ్ధిదారులుగా ఎంపిక చేసేవారు. ఇందు కోసం నాలుగైదు నెలల పింఛన్ మొత్తాన్ని లంచంగా ముట్టచెప్పాల్సి వచ్చేది. ప్రతి నెలా ఇచ్చే పింఛన్‌లోనూ రూ.100, 200 కోత పెట్టేవారు. మరణించిన వారి స్థానంలోనే కొత్త పింఛన్ వచ్చేది. టీడీపీ హయంలో పింఛన్ పొందడంలో అవ్వా,తాతలు, దివ్యాంగులు చాలా ఇబ్బందులు పడేవారు. గ్రామ పంచాయతీ కార్యాలయాలు, పాఠశాలల ప్రాంగణాలు, రచ్చబండల దగ్గర పడిగాపులు కాసేవారు.

నేడు

వైఎస్సార్ సీపీ పాలనలో పింఛన్ దారుల కష్టాలు తొలగిపోయాయి. అర్హతే ప్రామాణికంగా తీసుకుని రాజకీయాలకు అతీతంగా పింఛన్లు మంజూరు చేస్తున్నారు. ప్రతి 50 ఇళ్లకు గ్రామ,వార్డు వలంటీర్లను నియమించి.. వారి ద్వారా నేరుగా ఇంటికే పింఛన్ సొమ్ము పంపే ఏర్పాటు చేశారు ప్రతి నెలా ఒకటో తేదీ పండుగ ఉన్నా...సెలవైనా ..వానొచ్చినా... ఇంటికే వెళ్లి పింఛన్ సొమ్ము అందజేస్తున్నారు. దీంతో అవ్వా,తాతలు,దివ్యాంగుల కష్టాలు తొలగిపోయాయి. ఆస్పత్రుల్లో చికిత్స పొందుతుంటే అక్కడికే వెళ్లి పింఛన్ అందజేస్తున్నారు.



ఎన్నికలకు సిద్ధం కావాలి

కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్ కిషోర్



రాయచోటి: అన్నమయ్య జిల్లాలో జరిగే సార్వత్రిక ఎన్నికలకు అందరూ సిద్ధం కావాలని, నిర్వహణలో ఎలాంటి పొరపాట్లు లేకుండా పకడ్బందీగా ఏర్పాట్లను పూర్తి చేయాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్ కిషోర్ రిటర్నింగ్ అధికారులు, జిల్లా మండలస్థాయి నోడల్ అధికారులను ఆదేశించారు. ఆదివారం రాయచోటి కలెక్టరేట్‌లోని స్పందన హాల్‌లో జిల్లాలోని అన్ని నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులు, జిల్లా, మండలస్థాయి నోడల్ అధికారులతో ఎన్నికల సన్నద్ధతపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా నియోజకవర్గాలలో నోడల్ అధికారుల నియామకం, మ్యాన్ పవర్ మేనేజ్మెంట్‌లో పీఓ, ఏపీఓ, ఓపీఓల నియామకంపై తెలుసుకున్నారు. ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ, సి విజిల్ పరిష్కారం, మెటీరియల్, ఈవీఎంల మేనేజ్మెంట్, రిసెప్షన్, డిస్ట్రిబ్యూషన్, కౌంటింగ్ ఏర్పాట్లపై సమీక్షించారు. ఐటీ అప్లికేషన్స్ నిర్వహణ, ఈవీఎంల ఫస్ట్ రాండమైజేషన్, ఈవీఎం స్ట్రాంగ్ రూముల ఏర్పాట్లు, బ్యాలెట్ పేపర్ రిక్వైర్మెంట్, అత్యవసర సేవల ఓటర్ల పోస్టల్ బ్యాలెట్, ఈటీపీఎస్‌లపై తీసుకున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ డే మేనేజ్మెంట్, లా అండ్ ఆర్డర్, విజిలెన్స్, ఎన్ఫోర్స్‌మెంట్, ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలు, కంట్రోల్ రూమ్ ఏర్పాట్లు, నామినేషన్స్, వెబ్ కాస్టింగ్, తదితర అంశాలలో సుదీర్ఘంగా చర్చించి తీసుకోవాల్సిన చర్యలపై దిశా నిర్దేశం చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని లోపాలను పునరావృతం కాకుండా చూడాలన్నారు. ఎన్నికలలో పోలీస్ శాఖతో సమన్వయం చేసుకొని కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లను పూర్తి చేసుకోవాలన్నారు. జిల్లా వ్యాప్తంగా నగదు, బంగారు, వెండి, మద్యం, గంజాయి వస్తువుల రవాణా, లా అండ్ ఆర్డర్‌పై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. జిల్లాలో మోడల్ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని, ఓటుహక్కు వినియోగం, కొత్త ఓటర్ల నమోదుకు చైతన్య కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, డీఆర్‌ఓ సత్యనారాయణ రావు, ఆర్డీఓలు, నియోజకవర్గ రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులు, నోడల్ అధికారులు పాల్గొన్నారు.

కడపలో సాయుధ బలగాలతో 'ఫ్లాగ్‌మార్చ్'

కడప అర్బన్: నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోండి.. మీ వెంట మేమున్నాం.. అంటూ కడప నగరం చిన్నచౌక్ సీఐ పి. నరసింహారెడ్డి, ఎస్ఐ పి. రవికుమార్, సిబ్బందితో ప్రజలకు భరోసా కల్పించారు. జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ ఆదేశాల మేరకు కడప డీఎస్పీ ఎం.డి షరీఫ్ పర్యవేక్షణలో చిన్నచౌక్ సీఐ నరసింహారెడ్డి, ఎస్ఐ రవికుమార్‌లు పోలీసు సిబ్బంది ఆదివారం రాత్రి 'సశస్త్ర సీమాబల్' కేంద్ర సాయుధ బలగాలతో 'ఫ్లాగ్ మార్చ్'ను నిర్వహించారు. చిన్నచౌక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పాత బైపాస్, అశోక్‌నగర్, నెహ్రూనగర్, అప్సర సర్కిల్, ఎన్జీఓ కాలనీ, వై-జంక్షన్ ప్రాంతాల్లో ఫ్లాగ్ మార్చ్ చేస్తూ ప్రజలకు నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని భరోసా కల్పించారు. ప్రజలకు ఏ సమస్య ఉన్నా వెంటనే పోలీసులను సంప్రదించాలన్నారు. ఎలాంటి దుందుడుకు చర్యలకు పాల్పడవద్దని ఈ సందర్భంగా ప్రజలకు సూచించారు.

కార్యకర్తలే వైఎస్సార్‌సీపీ సైన్యం

- ఒక్క కుటుంబాన్ని ఆదుకోని నల్లారి సోదరులు
- ఎంపీ పీవీ మిథున్‌రెడ్డి



ప్రసంగిస్తున్న ఎంపీ మిథున్‌రెడ్డి. చిత్రంలో ఎమ్మెల్యే చింతల

కలకడ: 'మాకు తోడు-నీడ వైఎస్సార్ సీపీ కార్యకర్తల సైన్యమే..' అని రాజంపేట పార్లమెంట్ సభ్యులు పీవీ మిథున్‌రెడ్డి, పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. ఆదివారం కలకడలో నిర్వహించిన మండల స్థాయి కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్న నల్లారి.కిరణ్‌కుమార్‌రెడ్డి ఇక్కడ చేసిన అభివృద్ధి శూన్యమన్నారు. కిరణ్‌కుమార్‌రెడ్డి, కిషోర్‌కుమార్‌రెడ్డి ప్రవాసాంధ్రులు అని ఎద్దేవా చేశారు. తెలంగాణలో నివాసం ఉంటూ కరోన కష్టకాలంలో ఒక్క కుటుంబాన్ని అయినా ఆదుకున్నారా ? అని ప్రశ్నించారు. నేడు మతతత్వ బీజేపీ తరఫున రాజంపేట పార్లమెంట్ అభ్యర్థిగా సూట్‌కేసులతో వచ్చారని ధ్వజమెత్తారు. తాము ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండే విషయాన్ని గుర్తు చేశారు. నల్లారి సోదరులు ఒక్క వ్యాపారం చేయలేదు, వ్యవసాయం చేయలేదు, పరిశ్రమలు లేవు మరి కోట్ల రూపాయలు ఎలా వచ్చాయని ప్రశ్నించారు. ఎన్ఆర్‌సీ, సీఏఏ వల్ల ఎలాంటి నష్టం లేదని కిరణ్‌కుమార్‌రెడ్డి చెప్పడం దారుణమన్నారు. టీడీపీ కూటమిని ఓడించాలని ఎంపీ ప్రజలకు పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించారన్నారు. అలాగే పార్టీ తరఫున విధిగా కార్యకర్తలను గౌరవించి వారి కుటుంబాలను ఆదుకుంటామని హామీ ఇచ్చారు. గాలేరు-నగరి నీటిని పైప్ లైన్ ద్వారా తరలిస్తే ఇక్కడి నీటి సమస్య శాశ్వతంగా తొలగిపోతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఏపీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మళ్లీ గెలిపించుకుందామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రమైనార్టీ కమీషన్ చైర్మన్ డాక్టర్ ఇక్బాల్ అహమ్మద్, మాజీ మార్కెట్‌కమిటీ చైర్మెన్ తిమ్మారెడ్డి, రవికుమార్‌రెడ్డి, జిల్లా జేసీఎస్ పరిశీలకులు నరసింహారెడ్డి, పార్టీ పరిశీలకులు సహదేవరెడ్డి, ఎంపీపీ శ్రీదేవి, జెడ్పీటీసీ సభ్యురాలు హారిక, సర్పంచ్ శాంతమ్మ, ప్రత్యేక ఆహ్వానితురాలు సరళ, ఆర్‌బీకే చైర్మన్ హరినాథరెడ్డి, కన్వీనర్ కమలాకర్‌రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షులు వెంకట్రమణరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు క్రిష్టారెడ్డి పాల్గొన్నారు.

అవే వాహనాలు.. అదే ప్రజలు

- కమలాపురం నియోజకవర్గంలోనూ షర్మిల రోడ్‌షో అట్టర్ ఫ్లాప్



కమలాపురంలో జరిగిన షర్మిల మీటింగులకు కడప నుంచి జనాన్ని తరలించిన వాహనాలు

కమలాపురం/వల్లూరు: ఏపీసీసీ అధ్యక్షురాలి హోదాలో కడప పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీచేస్తున్న షర్మిల కమలాపురం నియోజకవర్గంలో ఆదివారం జరిగిన ప్రచార కార్యక్రమానికి కడప నుంచి దాదాపు 40 ప్రత్యేక వాహనాల్లో (తుఫాన్) అక్కడి నుంచే ప్రజలను తీసుకువచ్చారు. నియోజకవర్గంలోని అన్ని మండలాలకు అవే వాహనాల్లో కడప నుంచి వచ్చిన ప్రజలనే తరలించారు. రాత్రి 8 గంటలవుతున్నా ఇంకా ఇదేమి ప్రచారం అని కడప నుంచి వచ్చిన మహిళలు అసహనం వ్యక్తం చేశారు. నియోజకవర్గంలోని చింతకొమ్మదిన్నె మండలంలో ఉదయం ప్రారంభమైన ఆమె ప్రచారం రాత్రి చెన్నూరు మండలంలో ముగిసింది. పీసీసీ అధ్యక్షురాలిగా ఆమె కమలాపురం నియోజకవర్గంలో మొదటి సారిగా ఎన్నికల ప్రచారానికి రాగా ప్రజాదరణ కనిపించలేదు. మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి కుమార్తె సునీత, మాజీ రాజ్యసభ సభ్యుడు తులసిరెడ్డి, సీపీఐ రాష్ట్ర నాయకుడు ఓబులేసు, ఇండియా కూటమి కమలాపురం ఎమ్మెల్యే అభ్యర్థి గాలి చంద్ర తదితరులతో కలసి ప్రచారానికి వచ్చిన షర్మిలకు ఏ ఒక్క మండలంలో ప్రజలు ఆదరించక పోవడంతో షెడ్యూల్‌లో ఉన్న సమావేశాలను వరుసగా ఆమె రద్దు చేసుకోవాల్సి వచ్చింది. షెడ్యూల్ మేరకు నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో మొత్తం 10 మీటింగుల్లో ఆమె మాట్లాడాల్సి ఉండగా జనం లేక 7 మీటింగులను రద్దు చేసుకున్నారు. ఉదయం చింతకొమ్మదిన్నె మండలం మూలవంక, చింతకొమ్మదిన్నె హెడ్ క్వార్టర్, అలాగే పెండ్లిమర్రి మండలం ఎల్లటూరు, పెండ్లిమర్రి హెడ్‌క్వార్టర్‌లో జరగాల్సిన కార్నర్ మీటింగులను కేవలం ప్రజలు లేకనే రద్దు చేసుకున్నారు. పెండ్లిమర్రి మండలంలోని నందిమండలంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. జనం నుంచి స్పందన కనిపించక పోవడంతో వీఎన్ పల్లె మండలంలోని తంగేడు పల్లె వద్ద నుంచి మధ్యాహ్నం భోజన విరామం తర్వాత చాలా ఆలస్యంగా ఆమె తిరిగి బయలు దేరారు. వీఎన్ పల్లె మండలం హెడ్ క్వార్టర్‌లో, కమలాపురం మండలం పెద్దచెప్పలిలో సైతం షర్మిల తన సమావేశాలను జన స్పందన లేక పోవడంతో రద్దు చేసుకోవాల్సి వచ్చింది. కాగా కమలాపురం క్రాస్ రోడ్డులో జరగాల్సిన సభను ప్రజలు లేక పోవడంతో కమలాపురం టౌన్‌లోని చౌక్‌లో నిర్వహించారు. ప్రజలు లేక పోవడంతో వల్లూరులో జరగాల్సిన సమావేశాన్ని సైతం రద్దు చేసుకోవాల్సి వచ్చింది. చెన్నూరు కొత్త రోడ్డులో సభ నిర్వహించారు. కాగా షెడ్యూల్‌లో లేని పెండ్లిమర్రి మండలంలోని యాదవాపురానికి వెళ్లి ఇటీవల హత్యకు గురైన శ్రీనివాసులు కుటుంబాన్ని ఆమె పరామర్శించారు.

రామదర్శనం.. ముక్తిదాయకం





ప్రత్యేక అలంకరణలో పట్టాభిరామస్వామి సమేత సీతమ్మ, లక్ష్మయ్య స్వామి, బ్రహ్మోత్సవాలకు ముస్తాబైన పట్టాభిరామాలయం

11 నుంచి పట్టాభిరాముడి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

వాల్మీకిపురం: వాల్మీకిపురంలో వెలసిన పట్టాభిరామ స్వామిని దర్శించుకుంటే మోక్షం లభిస్తుందని భక్తుల విశ్వాసం. వాల్మీకి మహర్షి ఈ ప్రాంతంలో తపస్సు చేయడంతోనే ఈ గ్రామానికి వాల్మీకిపురం అన్న పేరు వచ్చిందని, శ్రీరామచంద్రుడు వాల్మీకం (పుట్ట)లో వెలిసినందున వాల్మీకిపురం అయిందన్న అభిప్రాయాలున్నాయి. ఈ నేపథ్యంలో ఇక్కడ వెలసిన పట్టాభిరాముడికి ఏటా నిర్వహించే బ్రహ్మోత్సవాలు ఈ ఏడాది 11వ తేది గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి.

ఆలయ ప్రాశస్త్యమిదీ..

అన్నమయ్య జిల్లా, వాల్మీకిపురంలో వెలసిన శ్రీ పట్టాభిరామస్వామి దేవాలయం వెయ్యేళ్ల క్రితం నిర్మించినట్లు, 13వ శతాబ్దంలోనే ఈ పట్టాభిరామస్వామి దేవాలయాన్ని పునఃనిర్మాణము గావించినట్లు రికార్డులు తెలుపుచున్నాయి. 15వ శతాబ్దంలో తొలి తెలుగు వాగ్గేయకారుడు పద కవితా పితామహులు శ్రీ తాళ్లపాక అన్నమాచార్యుల వారు వాల్మీకిపురం క్షేత్రాన్ని సందర్శించి ఎన్నో కీర్తనలను రచించినారు. ఈ పట్టాభిరామాలయంలో గల మూల విగ్రహాలను మహర్షి జాంబవంతులు వారిచే ఒకేచోట ప్రతిష్ఠించడమైనది. వాల్మీకిపురం పరిసర ప్రాంతంలోని శతశృంగపర్వతాలలో వాల్మీకి మహర్షి తపస్సు చేసినారని, ఈ కారణంగా వాల్మీకిపురం క్షేత్రం పురాణ ప్రసిద్ధిగాంచినది. భారతదేశంలో 'అయోధ్య' తర్వాత శ్రీరామ క్షేత్రాలలో మొదటిస్థానం ''వాల్మీకిపురమే''. ఎంతో ఘనమైన చరిత్ర కల్గిన ఈ ఆలయానికి ఆనాటి రాజులు శ్రీకృష్ణదేవరాయులు, ఛత్రపతి శివాజీ, అతని తల్లి జిజియాబాయి, సాళువ నరశింగభూపతిరాయలవారు మరియు ఆంగ్లేయుల అధిపతులలో థామస్ మన్రో, సి.పి బ్రౌన్, హార్డ్‌హార్డింగ్ వంటి వారు, ముస్లీం నవాబులు శ్రీరాముని సేవించి తరించారని ప్రతీతి.

ఇలా చేరుకోవచ్చు

తిరుపతి నుంచి 90 కిలో మీటర్లు దూరంలో వాల్మీకిపురం శ్రీ పట్టాభిరామాలయం ఉంది. తిరుపతి-మదనపల్లి హైవే రోడ్డు పక్కన కలదు. తిరుపతి నుంచి ప్రతి 30 నిమిషాలకు బస్సు సౌకర్యం కలదు. అలాగే మదనపల్లి నుంచి 20 కిలో మీటర్ల దూరంలో ఈ ఆలయం ఉంది. మదనపల్లి నుంచి ప్రతి 15 నిమిషాలకు బస్సు సౌకర్యం కలదు.

ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి చొరవతో టీటీడీ అనుబంధం

ఆలయ అనువంశిక ధర్మకర్తలుగా ప్రస్తుత ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి కుటుంబీకులు వ్యవహరించేవారు. దేవదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో ఉన్న ఇంతటి చరిత్ర కల్గి పురాణ ప్రసిద్ధిగాంచిన శ్రీ పట్టాభిరామస్వామి ఆలయాన్ని 1997 సంవత్సరంలో ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి చొరవతో తిరుమల-తిరుపతి దేవస్థానమునకు అనుబంధ దేవాలయంగా చేర్చారు. ఆనాటి నుంచి నేటి వరకు తిరుమల-తిరుపతి దేవస్థానము వారు ఎంతో వైభవంగా యేటా శ్రీపట్టాభిరామ స్వామివారి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నారు. అలాగే ఏడాది ఒక్కసారి పవిత్రోత్సవాలు, పట్టాభిషేక మహోత్సవాలు, ప్రతి మాసం పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకొని స్వామివారి కళ్యాణోత్సవం నిర్వహించడం జరుగుతుంది.

బ్రహ్మోత్సవాల వివరాలు..

- 11వ తేది గురువారం: బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ
- 12వ తేది శుక్రవారం: ఉదయం – ధ్వజారోహణము , రాత్రి – గజ వాహన సేవ
- 13వ తేది శనివారం: ఉదయం – ముత్యపుపందిరి వాహనము , రాత్రి – హనుమంత వాహనము
- 14వ తేది ఆదివారం: ఉదయం – కల్పవృక్ష వాహనము, రాత్రి – సింహ వాహనము
- 15వ తేది సోమవారం: ఉదయం – సర్వభూపాల వాహనము, రాత్రి – పెద్ద శేష వాహనము
- 16వ తేది మంగళవారం: ఉదయం – సూర్యప్రభ వాహనము, సాయంత్రం – చంద్ర ప్రభ వాహనము – రాత్రి మోహినీ అవతారము
- 17వ తేది బుధవారం: ఉదయం – తిరుచ్చి ఉత్సవము , రాత్రి – శ్రీ సీతారాముల కళ్యాణోత్సవం, గరుడ సేవ.
- 18వ తేది గురువారం: ఉదయం – రథోత్సవం, సాయంత్రం – ధూళి ఉత్సవం
- 19వ తేది శుక్రవారం: ఉదయం – తిరుచ్చి ఉత్సవము , రాత్రి – పార్వేట ఉత్సవం, అశ్వవాహనము.
- 20వ తేది శనివారం: ఉదయం – వసంతోత్సవము, చక్రస్నానం, రాత్రి – హంస వాహనము, ధ్వజావరోహణము.
- 21వ తేది ఆదివారం: ఉదయం – స్నపన తిరుమంజనం – సాయంత్రం – పుష్పయాగం, పుష్ప ప్రసాద వితరణ.

క్లుప్తంగా

ఆటో ఢీకొని వ్యక్తి మృతి



రోడ్డుప్రమాదంలో మృతిచెందిన లక్ష్మన్న

కలకడ : ఆటో ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన ఆదివారం జరిగింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఆదివారం తెల్లవారుజామున కలకడ మండలం, కె.బాటవారిపల్లె పంచాయతీ కలకడ మాదిగపల్లె గ్రామానికి చెందిన లక్ష్మన్న (70) చిత్తూరు-కర్నూలు జాతీయ రహదారిపై నడిచి వెళుతుండగా వెనుక వైపునుంచి ఆటో ఢీకొంది. గాయపడిన లక్ష్మన్నను చికిత్స నిమిత్తం 108 వాహనంలో పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ప్రమాదానికి కారణమైన ఆటోను సీజ్‌చేసి, ఆటోడ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

గుండెపోటుతో వీఆర్‌ఓ..



మృతిచెందిన నాగేశ్వరయ్య

చిన్నమండెం : బోనమల వీఆర్‌ఓ నాగేశ్వరయ్య(52) గుండెపోటుతో మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. చిన్నమండెం మండలం బోనమల గ్రామ రెవెన్యూ అధికారిగా నాగేశ్వరయ్య పనిచేస్తున్నారు. ఆదివారం సెలవు దినం కావడంతో స్వగృహంలో ఉన్న నాగేశ్వరయ్య ఉన్నట్లుండి ఛాతిలో నొప్పి వస్తోందన్నారు. బంధువులు హుటాహుటిన రాయచోటిలోని ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న రెవెన్యూ సిబ్బంది నాగేశ్వరయ్య భౌతికకాయం వద్ద నివాళులు అర్పించారు.

కుక్కల దాడిలో 15 గొర్రెలు మృత్యువాత



కుక్కల దాడిలో మృతి చెందిన గొర్రెలు

చిన్నమండెం : కుక్కలు దాడి చేయడంతో 15 గొర్రెలు మృతి చెందినట్లు బాధిత రైతు శివశంకర్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. మండల పరిధిలోని టి.చాకిబండ గ్రామం సైగలవాండ్లపల్లెలో ఉన్న గొర్రెల మందపై ఒకక్కసారిగా కుక్కలు దాడి చేశాయి. దీంతో 15 గొర్రెలు మృత్యువాత పడటంతో దాదాపు రూ.2.50 లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు వాపోయారు.

సస్యరక్షణే మామిడికి శ్రీరామరక్ష

- మామిడిని ఆశిస్తున్న చీడపీడలు
- నివారణ చర్యలు చేపట్టాలంటున్న వ్యవసాయ అధికారులు

రాయచోటి : ఉద్యాన పంటల్లో ఫలరాజుగా ప్రసిద్ధి చెందిన మామిడికి ఈ ఏడాది గడ్డు పరిస్థితులు దాపురించాయి. గతేడాది వర్షాభావ పరిస్థితులు, ఈ వేసవిలో అధిక ఉష్ణోగ్రతల కారణంగా పూత సకాలంలో రాలేదు. ఫలితం మామిడి పంటను ఆశించి జీవనం సాగిస్తున్న రైతులు, వ్యాపారుల పరిస్థితి మూలిగే నక్కపై తాటిపండు పడ్డ చందంగా తయారైంది. వీటికి తోడు అరకొరగా కాసిన మామిడి కాయలకు చీడపీడలు ఆశించి మరింత నష్టాన్ని, కన్నీటిని మిగుల్చుతున్నాయి. కాయదశలో ఉన్న మామిడిని చీడ పీడల నుంచి కాపాడుకునేలా చర్యలు చేపట్టాలని రాయచోటి ఉద్యానవన అధికారి నాగమణి రైతులకు సూచిస్తున్నారు.

జిల్లా వ్యాప్తంగా ప్రస్తుతం మామిడి పిందె, కాయ దశలో ఉంది. ఈ దశలో చేపట్టే సస్యరక్షణ, యాజమాన్య పద్ధతులు పంటకు అత్యంత కీలకమని నాగమణి చెబుతున్నారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో రసం పీల్చే పురుగులైన తామర, తేనెమంచు పురుగు, పిండినల్లి, తెగుళ్లలో బూడిద తెగులు, నల్ల మచ్చ తెగులు పంటను ఎక్కువగా ఆశించే అవకాశం ఉందన్నారు. వీటిని సకాలంలో నివారిస్తూ కొన్ని ఇతర యాజమాన్య పద్ధతులు పాటిస్తే ఉన్న పంటను మంచి దిగుబడితో పాటు నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చన్నారు.

తామర పురుగులు

ఈ పురుగులు మామిడి ఆకులపై ఎక్కువ సంఖ్యలో చేరి పత్రహరితాన్ని గోకి రసాన్ని పీల్చేస్తాయన్నారు. దీనివల్ల ఆకులు ముడుచుకుపోయి, ఎండిపోవడం, పిందెలపై గోధుమరంగు గరుకు మచ్చలు ఏర్పడి దిగుబడి తగ్గడమే కాకుండా కాయ నాణ్యత దెబ్బతింటుందన్నారు.

నివారణ : ఈ పురుగుల నివారణకు ఫిప్రోనిల్ 2 ఎంఎల్ లేదా స్పైనోసాడ్ 0.3ఎంఎల్ లీటరు నీటికి కలిపి పిందెలు ఎదిగే దశలో పిచికారీ చేస్తే ఫలితం ఉంటుంది.



ఐరన్ లోపంతో రంగు మారిన మామిడి ఆకులు

తేనెమంచు పురుగులు

లేత గోధుమ రంగులో ఉండే తల్లి, ముదురు రంగులో ఉండే పిల్ల పురుగులు, లేత ఆకుల దశ, పూత దశలో ఆశించి విపరీతమైన నష్టం కలుగజేస్తాయి. పూత లేనప్పుడు తల్లి పురుగులు ప్రధానంగా కాండం, బెరడు పగుళ్లలో దాగి ఉండి దగ్గరకు వెళ్లినప్పుడు శబ్దం చేస్తూ ఎగిరిపోవడాన్ని బట్టి తేనె మంచు పురుగు ఆశించినట్లుగా తేలికగా గమనించవచ్చు. ఈ పురుగులు లేత ఆకులు, పూల నుంచి రసం పీల్చి తేనెలాంటి జిగురు పదార్థాన్ని విసర్జిస్తాయి. ఈ జిగురు పదార్థంపై నల్లని బూజు ఏర్పడి మసి తెగులు కనిపిస్తుంది. రసం పీల్చడం వల్ల ఆకులు ముడుచుకుపోవడం, నల్లని మసి ఏర్పడటం, పూత రాలిపోవడం, కాయలపై మసి ఏర్పడి కాయ నాణ్యత తగ్గిపోతుంది.

నివారణ : చెట్లు గుబురుగా ఉండి, గాలి, వెలుతురు సోకకుండా ఉన్నప్పుడు ఈ పురుగు ఉధృతి ఎక్కువ అవుతుంది. కావున ఎప్పటికప్పుడు ఏటా గుబురు కొమ్మలను కత్తిరించి గాలి, వెలుతురు సోకేలా చేయాలి. ఈ పురుగు నివారణకు డైమిథోయేట్ 2ఎంఎల్ లేదా ఎసిఫేట్ 1.5 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. చెట్టు మొదలు, కొమ్మలు బెరడు పూర్తి తడిచేలా చూసుకోవాలి.

పిండినల్లి

పిల్ల పురుగులు లేత రెమ్మలు, కాయలు, తొడిమెలపై గుంపులుగా చేరి రసాన్ని పీల్చి నష్టపరుస్తాయి. ఈ పురుగులు విసర్జించే తేనె వంటి పదార్థంపై శిలీంద్రాలు పెరగడం వల్ల నల్లని మసి ఏర్పడుతుంది. పిండి నల్లి ఎక్కువగా ఆశిస్తే కాయలు సరిగా ఎదగకుండా రాలిపోతాయి.



బోరాన్ లోపంతో పగిలిపోయిన మామిడి కాయ



నాగమణి, హెచ్‌ఓ, రాయచోటి

నివారణ

ఈ పురుగు నివారణకు ఇమిడాక్లోప్రిడ్ 0.3ఎంఎల్ లేదా థయోమిథాక్సామ్ 0.3 గ్రాములు లేదా ఎసిఫేట్ 1.5 గ్రాములు లీటరు నీటికి కలిపి చెట్టు కాండం, కొమ్మల నుంచి ఆకుల వరకు పూర్తిగా తడిచేలా పిచికారీ చేయాలి.

పక్షి కన్ను తెగులు

దీన్నే నల్లమచ్చ తెగులు అంటారు. ఈ తెగులు మొక్క ఆకులు, లేత పిందెలు, పెద్ద కాయలపై ఆశించి నల్ల మచ్చలను ఏర్పరుస్తుంది. దీనివల్ల ఆకులు, పిందెలు విపరీతంగా రాలిపోతాయి. అలాగే కాయలపై నల్లని మచ్చలు ఉండటం వల్ల కాయ నాణ్యత దెబ్బతిని మార్కెట్‌లో సరైన ధర లభించదు.

నివారణ

ఎండిన కొమ్మలు, గుబురు కొమ్మలను ఎప్పటికప్పుడు కత్తిరించి కాల్చివేయాలి. రాలిన కాయలను సేకరించి గుంతలో వేసి పూడ్చాలి లేదా కాల్చివేయాలి. ఒక లీటరు నీటికి 3 గ్రాములు కాపర్ ఆక్సీక్లోరైడ్ విడిగా లేదా అవసరం మేరకు పురుగు మందులతో కలిపి 2 నుంచి 3 సార్లు వివిధ దశలలో పిచికారీ చేయాలి.

మామిడిలో సూక్ష్మపోషక లోపాలు – నివారణ

మామిడిలో వివిధ రకాల సూక్ష్మపోషక లోపాల వల్ల పిందె, పూత రాలడం గమనించవచ్చు. అలాగే కాయలు సరిగా పెరగవు. కాయలో నాణ్యత రుచి ఉండదు. ప్రస్తుతం మామిడి పూత దశలో ఉంది. ఈ తరుణంలో సూక్ష్మ పోషక లోపాలను నివారించడానికి చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యల గురించి తెలుసుకుందాం.

పొటాష్ లోపం – లక్షణాలు : పొటాష్ లోపం వల్ల మామిడి ఆకుల అంచులు ఎండిపోతాయి.

నివారణ : 13:0:45 లేదా 0:0:50 లీటరు నీటికి 10 గ్రాములు కలిపి పిచికారీ చేసుకోవాలి.

జింక్ లోపం – లక్షణాలు

మామిడిలో జింక్ లోపం వల్ల ఆకులు చిన్నవిగా మారిపోయి కణుపుల మధ్య దూరం తగ్గడం, ఆకులు గుబురుగా మారడాన్ని మనం గమనించవచ్చు.

నివారణ : చిలమిన్ జింక్ లీటరు నీటికి 2 గ్రాములు కలిపి పిచికారీ చేసుకోవాలి.

ఐరన్ లోపం

దీని వల్ల మామిడి ఆకుల్లో ఈనెల మధ్య భాగం పసుపు రంగుగా మారిపోయి తర్వాత తెలుపు రంగుగా మారుతుంది. దీని నివారణకు లీటరు నీటికి 2 గ్రాముల నిమ్మ, ఉప్పు కలిపి పిచికారీ చేసుకోవాలి.

బోరాన్ లోపం

దీని వల్ల లేత ఆకులు ఎండిపోవడం, కాయలు పగిలిపోవడం జరుగుతుంది. దీని నివారణకు బోరాన్ 1 గ్రాము లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి. సూక్ష్మ పోషకాల నివారణకు ముఖ్యంగా సేంద్రియ ఎరువులు ఒక మొక్కకి 30 కేజీల పశువుల ఎరువు, 100 గ్రాముల జింక్ సల్ఫేట్, 100 గ్రాముల ఫెర్రస్ సల్ఫేట్‌ను ఉపయోగించడం వల్ల మామిడిలో సూక్ష్మ పోషకాల లోపాలను అధిగమించి అధిక దిగుబడులను పొందవచ్చు. వీటిని పిచికారీ చేసే సమయంలో స్థానిక వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలని వ్యవసాయాధికారి సూచించారు.

నవశకం

వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించాక ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. అస్తవ్యస్తంగా ఉన్న సర్కారు బడుల రూపురేఖలు మార్చేశారు.. పేదలకు సొంతింటి కల సాకారం చేస్తున్నారు. సచివాలయాల ద్వారా క్షణాల్లో ప్రతి పని జరుగుతోంది. ఫలితంగా పేదల బతుకులు బాగుపడ్డాయని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. – సాక్షి నెట్‌వర్క్

నాడు-నేడుతో బడులకు కొత్తరూపు



గతంలో ఎన్నడూ లేని విధంగా సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చేసి విద్యాభివృద్ధికి ఎనలేని కృషి చేశారు. ఓ వైపు పాఠశాలల్లో వసతులు, మరో వైపు విద్యార్థులకు విద్యా సామగ్రి సకాలంలో అందిస్తున్నారు. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయిలో విద్య అందుతోంది. గతంలో ఎన్నడూ ఈ మార్పు చూడలేదు. కేవలం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యాకే ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ చేకూరింది.

– ఎం. నాగలక్ష్మి, కొత్తమాధవరం జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం, ఒంటిమిట్ట మండలం

ఇంటి వద్దకే ధ్రువీకరణ పత్రాలు



ఒక్క రూపాయి ఖర్చు లేకుండా ఇంటి వద్దకే మా పిల్లలకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలు వచ్చాయి. గతంలో ధ్రువీకరణ పత్రాలు కావాలంటే మండల కేంద్రానికి వెళ్లి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంది. అవి ఎప్పుడు వస్తాయో కూడా తెలియని పరిస్థితి ఉండేది. ఇటీవల నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అవసరమైన ధ్రువీకరణ పత్రాలన్నీ సచివాలయం ద్వారానే వస్తాయని వలంటీర్ ప్రవీణ్ చెప్పడంతో కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం దరఖాస్తు చేసుకున్నాము. రెండు రోజుల వ్యవధిలోనే దరఖాస్తు చేసుకున్న ధ్రువీకరణ పత్రాలన్నీ ఉచితంగానే అందజేశారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలన్నీ కూడా వలంటీర్ ద్వారా ఇంటి వద్దకే అందిస్తున్నారు. మా పిల్లలకు అమ్మఒడి, జగనన్న విద్యాదీవెన, వసతిదీవెన పథకాల ద్వారా మాకు లబ్ధి చేకూరింది. సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి మేము ఎప్పటికీ రుణపడి ఉంటాము.

– కనుమల వెంకటలక్షుమ్మ, కాలువపల్లె, గోపవరం మండలం

వైఎస్సార్‌సీపీలోకి 200 మంది చేరిక



వైఎస్సార్ సీపీలోకి చేరిన యువకులతో ఎమ్మెల్యే అభ్యర్థి నిసార్‌అహ్మద్



మేడా రఘునాథరెడ్డి, అనిల్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ నేతలు

మదనపల్లె : ఎన్నికలు దగ్గర పడుతున్న కొద్దీ వైఎస్సార్ సీపీలోకి భారీగా చేరికలు జరుగుతున్నాయి. పట్టణంలోని సొసైటీకాలనీ వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో నిమ్మనపల్లె మండలం కొండయ్యగారిపల్లె, నిమ్మనపల్లె, వెంగంవారిపల్లె, సామకోటవారిపల్లెకు చెందిన 200 మంది యువకులు పార్టీలోకి చేరారు. నిమ్మనపల్లె వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు ఆర్.ఐ.రమణారెడ్డి, హేమంత్ ఆధ్వర్యంలో... ఎమ్మెల్యే అభ్యర్థి నిసార్ అహ్మద్ యువకులకు వైఎస్సార్‌సీపీ కండువాలు కప్పి, సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన యువకులు మాట్లాడుతూ... వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు తమకు ఎంతో దోహదపడ్డాయని, జగనన్నను మరోసారి సీఎం చేసేందుకు పనిచేస్తామని పార్టీలో చేరిన వారు చెప్పారు. వైఎస్సార్ సీపీలో చేరిన ప్రతి ఒక్కరికీ సముచిత స్థానం కల్పిస్తామని, వచ్చే ఎన్నికల్లో నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేసే బాధ్యతను ప్రతి ఒక్కరూ తీసుకోవాలని ఎమ్మెల్యే అభ్యర్థి నిసార్ అహ్మద్ కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ జింకా వెంకటాచలపతి, వైఎస్సార్‌సీపీ నాయకులు లియాఖత్ అలీ, ఖాదర్ తదితరులు పాల్గొన్నారు. వైఎస్సార్ సీపీలో చేరిన వారిలో చరణ్, శబరీష్, అబులుసింగ్, అభిరాం, దీపక్, రమణ, చందు, సంతోష్, భార్గవ, ఫిరోజ్‌ఖాన్ తదితరులు ఉన్నారు.

లేబాకలో 14 కుటుంబాలు..

నందలూరు(రాజంపేట) : నందలూరు మండలంలోని లేబాక గ్రామంలో వైఎస్సార్‌సీపీలోకి 14 టీడీపీ కుటుంబాలు చేరాయి. ఆదివారం ఎంపీ మేడా రఘునాథరెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి సోదరుడు ఆకేపాటి అనిల్‌రెడ్డి, ఎంపీపీ మేడా విజయభాస్కర్ రెడ్డి సమక్షంలో టీడీపీ వర్గీయులు వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. మండల పార్టీ కన్వీనర్ అన్నం నాగేంద్ర నేతృత్వంలో నాగి వెంకటసుబ్బయ్యతోపాటు పలువురు టీడీపీ నాయకులు వైఎస్సార్‌సీపీ కండువాను కప్పుకున్నారు. అలాగే లేబాక అరుంధతీవాడలోని టీడీపీ వర్గీయులు కూడా వైఎస్సార్‌సీపీలో చేరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గడికోట ఉషాసుబ్బారెడ్డి, వైఎస్సార్‌సీపీ నేతలు సంజీవరాయుడు, గీతాల నరసింహారెడ్డి, కృష్ణారెడ్డి, ఒర్సు శ్రీను, దళిత నాయకులు నాగసుబ్బయ్య, కాకి చంద్ర, సత్యాల రామకృష్ణ, బీసీ నేత భాస్కర్‌యాదవ్, సురేంద్ర, మైనార్టీ నేత పఠాన్ అక్బర్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య



ఆత్మహత్య చేసుకున్న రంజిత్‌కుమార్

సిద్దవటం : మండలంలోని శ్రీ నిత్యపూజ స్వామి కోనకు వెళ్లే రహదారిలోని వనేశ్వరం సమీపంలో రంజిత్‌కుమార్(32) అనే యువకుడు విషద్రావణం తాగి అత్మహత్య చేసుకున్నాడని ఎస్‌ఐ పెద్ద ఓబన్న తెలిపారు. సిద్దవటం ఎగువపేటకు చెందిన రాధాకృష్ణ రెండవ కుమారుడు రంజిత్‌కుమార్‌కు వివాహం కాలేదని మనస్తాపానికి గురయ్యేవాడు. శనివారం ఆత్మకూరు నుంచి సిద్దవటంలోని తన నివాసానికి వచ్చాడు. అదే రోజు మధ్యాహ్నం ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఎంత సేపటికీ రాకపోవడంతో అతని స్నేహితులు, బంధువులు సిద్దవటం పోలీసులకు శనివారం రాత్రి ఫిర్యాదు చేశారు. ఆదివారం ఉదయం మృతుని సెల్ ఫోన్ ఆన్‌లో ఉండటంతో లోకేషన్ గుర్తించారు. ఈ మేరకు తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

శాకంబరీ దేవి అలంకారంలో గంగమ్మ తల్లి

చింతకొమ్మదిన్నె : జిల్లాలో ప్రసిద్ధి గాంచిన చింతకొమ్మదిన్నె గంగమ్మ తల్లి ఆలయానికి వారాల జాతరలో భాగంగా నాల్గవ వారం భక్తులు అమ్మవారిని దర్శించడానికి అధిక సంఖ్యలో పోటెత్తారు, ఆలయ చైర్మన్ పి.బి విశ్వనాథరెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తగు ఏర్పాట్లు చేశారు. అమ్మవారికి తెల్లవారుజామునే అభిషేకాలు నిర్వహించి, పట్టు వస్త్రాలతో అలంకరించి, ప్రత్యేకంగా తెప్పించిన పూలమాలలు, కూరగాయలతో అమ్మవారి శాకంబరీ దేవిగా అలంకరించారు.

అగ్నిప్రమాదంలో మోటారు, పైపులు దగ్ధం

బి.కోడూరు : మండలంలోని గంగిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన సుబ్బారెడ్డి, పోలిరెడ్డి, మరో ఇద్దరు రైతులకు సంబంధించిన విద్యుత్ మోటార్లు, పైపులు అగ్నిప్రమాదానికి గురై కాలిపోయాయి. సగిలేరు నుంచి నీటిని పొలానికి అందించేందుకు పైపులు, మోటార్లను గతంలో రైతులు ఏర్పాటు చేసుకున్నారు. ప్రస్తుతం సగిలేరులో నీరు లేకపోవడంతో పాటు సగిలేరు వెంబడి ఉన్న కంపచెట్లు, తుంగ ఎండుముఖం పట్టాయి. ఆదివారం గుర్తు తెలియని వ్యక్తులు ఎండు జమ్ముకు నిప్పు పెట్టడంతో సగిలేరు వెంబడి సుమారు కిలోమీటరు మేర ఇరువైపులా మంటలు చెలరేగాయి. మధ్యాహ్నం సమయం కావడంతో రైతులు ఈ విషయాన్ని గమనించలేదు. అటుగా వెళుతున్న వారు దట్టమైన పొగలు వస్తుండటాన్ని గమనించి గ్రామస్తులకు సమాచారం ఇచ్చారు. వారు అక్కడికి వెళ్లి చూసేసరికి మోటార్లు, పైపులు అగ్నికి ఆహుతి అయ్యాయి. ఈ ప్రమాదంలో సుమారు రూ.1.50 లక్షలు నష్టం వాటిల్లినట్లు బాధిత రైతులు తెలిపారు. ప్రభుత్వం సాయం అందించి ఆదుకోవాలని వారు కోరుతున్నారు.



సగిలేరు వెంబడి మంటలు వ్యాపిస్తున్న దృశ్యం

ముగిసిన పింఛన్ల పంపిణీ

సుమారు 99.01 శాతం మందికి పింఛన్లు అందజేత

రాయచోటి : ఎన్నికల ముందు పింఛన్‌దారులకు పింఛన్ సొమ్ము అందకుండా చంద్రబాబు నాయుడు చేసిన ఎత్తులు ఏ మాత్రం ఫలించలేదు. పింఛన్ డబ్బుతోనే జీవనం సాగిస్తున్న పేద కుటుంబాలను అవస్థల పాలు చేయాలన్న కుయుక్తులు అసలు సాగలేదు. వలంటీర్లపై కొన్నాళ్లుగా పగపట్టిన చంద్రబాబు ఆ వ్యవస్థనే సమూలంగా లేకుండా చేయాలని కుట్ర పన్నిన సంగతి తెలిసిందే. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో వారితో పింఛన్ సొమ్ము పేదలకు పంపిణీ చేయకుండా అడ్డుకోబోయి అభాసుపాలయ్యారు. వలంటీర్లు పింఛన్‌దారుల ఇళ్లకు వెళ్లకుండా ఎన్నికల సంఘం(ఈసీ) ద్వారా నిలువరించారు. దీంతో వృద్ధులు, వితంతువులు, వికలాంగులు పింఛన్ సొమ్ముల కోసం మండుటెండలు, వడగాల్పులకు ఓర్చుకుని సచివాలయాల గడపలు తొక్కాల్సి వచ్చింది. అయితే రాష్ట్ర ప్రభుత్వం.. బాబు ఎత్తుగడను పింఛన్‌దారుల ఇబ్బందులను గమనించి పింఛన్ పంపిణీలో జాప్యం జరగకుండా సత్వర చర్యలు చేపట్టింది. సచివాలయాలలో వీరికి పింఛన్ సొమ్ము వెనువెంటనే అందించేలా ఏర్పాట్లు చేసింది. పింఛన్‌దారులకు మంచినీరు, కుర్చీలు, షామియానాలు వంటి వాటిని సమకూర్చింది. ఇలా ఈ నెల 4వ తేదీ నుంచి మొదలైన పింఛన్ల పంపిణీ కార్యక్రమం ఆదివారం కూడా అక్కడక్కడా కొనసాగింది. సచివాలయాలకు వెళ్లి పింఛన్ అందుకోలేని వారు (మంచానపడిన) అనారోగ్యం, వృద్ధాప్యంతో బాధపడుతున్న వారు, దివ్యాంగులకు వారి ఇళ్లకే సచివాలయ సిబ్బంది వెళ్లి సొమ్ము అందించాలని ప్రభుత్వం ఆదేశించింది. దీంతో అలాంటి వారి ఇళ్లకు సచివాలయం కార్యదర్శులు వెళ్లి పింఛన్ సొమ్ము అందజేసి వారికి తోడయ్యారు. ఇలా మూడు రోజుల్లోనే ఉమ్మడి అన్నమయ్య జిల్లాలో 2,25,131 మందికి గాను 2,22,697 మందికి రూ.66,16,79,500 కోట్లను అందజేసింది. దీంతో జిల్లాలో ఆదివారం సాయంత్రానికి 99.01 శాతం మందికి పైగా పింఛన్‌దారులకు డబ్బులు అందజేశారు. కాగా 58 నెలలుగా తమకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి నెల 1వ తేదీన వలంటీర్ల ద్వారా తమ ఇంటికి పింఛన్ సొమ్ము పంపించారని లబ్ధిదారులు గుర్తు చేసుకుంటున్నారు. తమ సంతోషాన్ని సహించలేని చంద్రబాబు కుట్రలు పన్ని మలమల మాడే ఎండల్లో సచివాలయాలకు వెళ్లే పరిస్థితి తీసుకొచ్చారని శాపనార్థాలు పెడుతున్నారు. తాను మళ్లీ ముఖ్యమంత్రి కాగానే వలంటీర్ల ద్వారా ఎప్పటిలాగే ఇళ్ల వద్దనే పింఛన్ సొమ్ము అందించేలా వలంటీర్ల ఫైల్‌పై తొలి సంతకం చేస్తానని సీఎం వైఎస్ జగన్ చేసిన ప్రకటన పండుటాకుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది.



పింఛన్ల పంపిణీ వ్యవస్థను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్(ఫైల్ ఫొటో)

కారు, లారీ ఢీ

చిన్నారి మృతి, నలుగురికి గాయాలు

మేదరమెట్ల : డ్రైవర్ నిద్రమత్తు కారణంగా అభం శుభం తెలియని చిన్నారి కానరానిలోకానికి వెళ్లింది. ఈ ఘటన బాపట్ల జిల్లా కొరిశపాడు మండలంలోని పి.గుడిపాడు జాతీయ రహదారిపై ఆదివారం ఉదయం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరుకు చెందిన కుటుంబం శ్రీకాకుళంలో గత మూడేళ్లుగా వ్యాపారం చేస్తూ అక్కడే ఉంటున్నారు. ఉగాది పండుగ సందర్భంగా స్వస్థలం రైల్వేకోడూరు బయలుదేరాలని నిశ్చయించుకున్నారు. దీంతో వారు కారులో బయలుదేరారు. సరిగ్గా గుడిపాడు జాతీయ రహదారి వద్దకు రాగానే డ్రైవర్ నిద్రమత్తులోకి జారుకున్నాడు. తేరుకునే లోగా కారు మొదటగా డివైడర్‌ను ఢీకొట్టి ఎదురుగా వస్తున్న లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ధార్విక (06) అక్కడికక్కడే దుర్మరణం పాలవ్వగా మరో నలుగురికి గాయాలయ్యాయి. గాయపడిన వారిలో శివసుందర్, ఈశ్వరయ్య, సంగతిక, నాగేశ్వరమ్మ, శేషవిన్ ఉన్నారు. క్షతగాత్రులను హైవే అంబులెన్సులో ఒంగోలు సంఘమిత్ర ఆసుపత్రికి తరలించారు. కారు పూర్తిగా నుజ్జునుజ్జు అయ్యింది. మేదరమెట్ల ఎస్‌ఐ చంద్రశేఖర్ ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



కారు ప్రమాదాన్ని పరిశీలిస్తున్న మేదరమెట్ల ఎస్‌ఐ చంద్రశేఖర్ (ఇన్‌సెట్) మృతి చెందిన ధార్విక

బుచ్చిరెడ్డిగారిపల్లెలో ఇరువర్గాల ఘర్షణ

- ఎంపీపీ లక్ష్మీ నరసమ్మకు తీవ్ర గాయాలు
- ఇరువర్గాలపై కేసులు నమోదు

బి.కొత్తకోట : మండలంలోని బుచ్చిరెడ్డిగారిపల్లెలో ఆదివారం తెల్లవారుజామున రెండు వర్గాలు పరస్పర దాడులకు పాల్పడ్డాయి. ఈ ఘటనలో బి.కొత్తకోట ఎంపీపీ లక్ష్మీ నరసమ్మకు తీవ్ర గాయాలయ్యాయి. సీఐ సూర్యనారాయణ కథనం మేరకు వివరాలు.. గుమ్మసముద్రం పంచాయతీ బుచ్చిరెడ్డిగారిపల్లెలోని ప్రభుత్వ భూమిలో నరేష్ అనే వ్యక్తి చెట్లు కొట్టి తరలించుకున్నట్లు ఎంపీపీ భర్త నరసింహులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై నరేష్ శనివారం దాడికి పాల్పడటంతో బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. కాగా అదే రోజు నరేష్ కూడా నరసింహులుపై ఫిర్యాదు చేశాడు. ఈ నేపథ్యంలో ఈ కేసుల వ్యవహారంపై ఆదివారం ఉదయం రెండు వర్గాలు ఘర్షణపడ్డాయి. దీనిపై ఎంపీపీ లక్ష్మీనరసమ్మ ఫిర్యాదు మేరకు.. నరేష్, గణేష్, నరసింహులు, గాయత్రి, హరీష్, మునెమ్మ, శంకరమ్మలపై పోలీసులు కేసు నమోదు చేశారు. అలాగే నరేష్ ఫిర్యాదు మేరకు.. ఎంపీపీ భర్త నరసింహులు, చిన్నప్ప, కుమార్, నవీన్, రవణమ్మ, ఎంపీపీ తల్లి, తండ్రి, సోదరుడిపై కేసు నమోదు చేశారు.





తీవ్రంగా గాయపడిన ఎంపీపీ లక్ష్మీనరసమ్మ, నరేష్